ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 10 సెప్టెంబరు 2024

'పొలం పిలుస్తోంది' మళ్లీ వాయిదా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మళ్లీ వాయిదా వేశారు. ఇంతకుముందు ఈనెల 3 నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 10కి వాయిదా వేశారు. తాజాగా భారీ వర్షాలతోపాటు వరద సహాయక చర్యల నేపథ్యంలో ఈనెల 24కి వాయిదా వేస్తూ వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు.

బతుకుదాం..!

- కష్టం వెనుకే సుఖం
- చీకటి తరువాత వెలుగులాగా..
- ఆత్మహత్యతో అయినవారికి కష్టాలు
- కుటుంబాలు వీధిన పడతాయి.. ఆలోచించండి..!
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

జీవితం జీవించడానికే..! అది పూర్తయ్యాక మరణం ఎలాగూ తప్పదు. అప్పటి వరకూ ప్రతి క్షణాన్నీ ఆస్వాదించాలి. కష్టమైతే పోరాడాలి. నష్టమైతే పూడ్చుకోవాలి. 'నా వల్ల కాదు..' అని అనుకోవద్దు. ప్రతి సమస్యకూ పరిష్కారం తప్పనిసరిగా ఉంటుంది. కాస్త ఓపికగా శోధించాలి, ప్రయత్నించాలి.. అంతే..! పొద్దు గూకిన తరువాత వచ్చే 'చీకటి' కష్టం అనుకుంటే.. కొన్ని గంటల తరువాత పొద్దు పొడిచి.. 'వెలుగు' నిండుతుంది కదా..! జీవితం కూడా అంతే..! కష్టం, సుఖం.. ఏదీ శాశ్వతం కాదు. ప్రకృతి ఇచ్చిన ప్రాణం.. అది తిరిగి తీసుకున్నప్పుడే పోవాలి. అంతేగానీ.. ముందుగానే వెళ్లిపోకూడదు. ఎందుకంటే.. మన ప్రాణం మన సొంతం కాదు. మనల్ని ప్రాణంగా ప్రేమించే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, మనపై ఆధారపడ్డ అందరిదీ..! వారికోసం నిలబడాలి. కష్టమొస్తే ఆప్తులతో పంచుకోవాలి. పరిష్కారం దిశగా అడుగులు వేయాలి. నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం. ఈ సందర్భంగా ఇంటి పెద్ద ఆత్మహత్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొన్ని కుటుంబాల పరిస్థితిపై ప్రత్యేక కథనం. ఆత్మహత్య అన్న ఆలోచన వచ్చినప్పుడు.. 'నేను పోతే నా కుటుంబం పరిస్థితి ఏమిటి..?' అన్న ఆలోచన చేయాలని, అయినవారిని అనాథలుగా చేసి వెళ్లిపోవద్దని చెప్పే ప్రయత్నం. ఒక్కక్షణం ఆగండి. ఆలోచించండి. బతకండి. అనాలోచిత నిర్ణయాలతో అయినవారికి జీవితకాలపు కన్నీటిని మిగల్చకండి.

- అనంతపురం అర్బన్/ కూడేరు/ విడపనకల్లు



కొడుకులతో కలిసి సునీతమ్మ

నేను పోతే నా పిల్లలు ఏమౌతారో..?

మాది విడపనకల్లు మండలం పొలికి గ్రామం. మాకు రెండు ఎకరాల పొలం ఉంది. నా భర్త సుమన్ బతికున్నప్పుడు మా పొలంతోపాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేసేవాళ్లం. ఐదేళ్ల పాటు వరుసగా నష్టాలు వచ్చాయి. దిగుబడులు సరిగా రాకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. పెట్టుబడుల కోసం రూ.10 లక్షలకు పైగా అప్పులు తెచ్చాము. వాటిని ఎలా తీర్చాలో తెలియక కౌలు తీసుకున్న పొలంలోనే ఆయన పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మాకు ముగ్గురు పిల్లలు.. హర్షవర్ధన్, అఖిల్, నానీ. ఎంత కష్టమొచ్చినా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి పిల్లలను బాగా చదివిద్దాం అనేవాడు. ప్రయోజకులను చేద్దామని చెప్పేవాడు. ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో మా కుటుంబంలో ఆనందం లేకుండా పోయింది. పిల్లలను పోషించడమే కష్టంగా మారింది. అందుకే ప్రైవేటు స్కూల్‌కు బదులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తున్నాను. నా పెద్ద కుమారుడు హర్షవర్ధన్ వజ్రకరూరు మండలం చాబాలలో జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మిగిలిన ఇద్దరిని మా ఊర్లోని ప్రాథమిక పాఠశాలకు పంపుతున్నాను. కూలీనాలి చేసుకుంటూ వారి కడుపు నింపుతున్నాను. సెలవు రోజుల్లో నాతోపాటు నా ముగ్గురు పిల్లలను కూలి పనులకు తీసుకువెళుతున్నాను. నేను ఒక్క దాన్ని పనిచేస్తే వచ్చే డబ్బులు బతికేందుకు చాలడం లేదు. ఆయన బతికే ఉంటే ముగ్గురు కొడుల్ని ఏదో ఒక ప్రైవేటు స్కూల్‌లో చదివించేవాడు. వాళ్లకు ఏ కష్టం రాకుండా చూసుకునేవాడు. ఆ అదృష్టం నా పిల్లలకు లేకుండా పోయింది. నా భర్త చనిపోయిన తర్వాత నాకు గుండె జబ్బు వచ్చింది. పోయిన సంవత్సరం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాను. అందుకోసం అప్పు చేయాల్సి వచ్చింది. నాకు ఆరోగ్యం సరిగా లేదు. చికిత్స చేయించుకునేందుకు వెళ్లినప్పుడు మా అత్త, బావ వాళ్ల ఇంట్లో పిల్లలను వదిలి వెళ్లాను. గుండె జబ్బుకు మందులు వాడితే సరిపోతుందని డాక్టర్లు చెప్పారు. నా వైద్యం ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాను. నాకేమైనా అయితే నా ముగ్గురు పిల్లలు అనాథలవుతారని బాధగా ఉంది.

- సునీతమ్మ, సుమన్ భార్య



భర్తను కోల్పోయి.. జీవచ్ఛవంలా మంజుల



కొడుకుతో రత్నమ్మ

ఊర్లో మర్యాద పోతుందని..

మాది విడపనకల్లు మండలం చీకలగురికి గ్రామం. మాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు పదెకరాలు కౌలుకు తీసుకుని నా భర్త చెన్నప్ప వేరుశనగ, మిరప సాగు చేసేవాడు. ఐదు సంవత్సరాలపాటు కౌలుకు తీసుకొని పంటలు పెట్టినా ఒక్క రూపాయి లాభం రాలేదు. పెట్టుబడుల కోసం రూ.10 లక్షలు అప్పులు చేశాడు. అంత అప్పు ఎలా తీర్చాలని రోజూ బాధపడేవాడు. అప్పులు తీర్చకపోతే ఊర్లో మర్యాద పోతుందని అనేవాడు. దిక్కుతోచని స్థితిలో రెండేళ్ల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికి నాకు ఎదిగిన కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన ఆత్మహత్య చేసుకోవడంతో మా కుటుంబం దిక్కులేనిదైంది. ఆయన లేని లోటును, ఆ బాధను గుండెల్లో దాచుకొని బతుకుతున్నాం. నా కూతురికి అప్పు చేసి పెళ్లి చేశాను. నేను, నా కొడుకు కూలి పనులకు వెళుతూ చిన్నగా అప్పులు తీర్చుకుంటున్నాం. మా ఆయన బతికి ఉన్నంత కాలం మాకు ఎలాంటి కష్టాలు లేకుండా చూసుకున్నాడు. ఇప్పుడు మా పరిస్థితి దీనంగా మారింది. నేను, నా కొడుకు రోజూ కూలి పనులకు పోతేనే మాకు ఇల్లు గడుస్తుంది. లేకపోతే ఇబ్బందులే. మా కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా సాయం అందలేదు. ఏ ప్రభుత్వ అధికారీ మా గురించి పట్టించుకోలేదు.



- రత్నమ్మ, చెన్నప్ప భార్య



పిల్లలు, అత్తతో బాధితురాలు మంజుల, కడదరకుంట, కూడేరు మండలం

చావలేక బతుకుతున్నా..

మాది కూడేరు మండలం కడదరకుంట. నా భర్త పేరు సంగప్ప. మాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. మరో పది ఎకరాలను కౌలుకు తీసుకొని వేరుశనగ, మిరప, ఆముదం, వరి పంటలను సాగు చేసేవాళ్లం. పెట్టుబడుల కోసం ఆయన రూ.5 లక్షలు అప్పు చేశారు. వడ్డీతో కలిపి రూ.6 లక్షలకు చేరింది. పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. దిక్కుతోచక ఐదు నెలల క్రితం మా తోటలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కూతురు వర్షిత కొర్రపాడు గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. పెద్ద కుమారుడు వరుణతేజ ఐదో తరగతి, ఆదిత్య రెండో తరగతి మా ఊర్లోనే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ప్రతి రోజూ కూలి పనులకు వెళుతూ వారిని పోషిస్తున్నాను. ఆయన లేరు. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. గురుకుల పాఠశాలలో చదువుతున్న నా కూతురును చూసేందుకు వెళదామంటే చార్జీల ఖర్చులు గుర్తొస్తున్నాయి. దీంతోపాటు ఒక రోజు కూలి పని పోతుంది. అందుకే తనను చూసేందుకు వెళ్లడం లేదు. ఆయన బతికున్న సమయంలో కాడెద్దులు, బండి ఉండేవి. ఇద్దరం కలిసి వ్యవసాయం చేసుకునేవాళ్లం. ఆయన పోయాక వ్యవసాయం వదిలేసి కూలి పనులకు వెళుతున్నాను. కూతురు అంటే ఆయనకు చాలా ఇష్టం. తనను బాగా చదివించాలని ఎప్పుడూ అనేవాడు. ఆయన ఉన్నప్పుడు కుటుంబ బాధ్యతలను తనే చూసుకునేవాడు. ఇంట్లోకి ఏం కావాలన్నా ఆయనే తీసుకొచ్చేవాడు. ఆయన ఆత్మహత్యతో కుటుంబ భారమంతా నాపై పడింది. ఏ నాడూ కూలికి వెళ్లని నేను ఆయన పోయాక పిల్లలను పోషించుకునేందుకు కూలి పనులకు వెళుతున్నాను. ఆయన బతికి ఉంటే ఎలాగోలా అప్పులు కట్టేవాళ్లం. ఇప్పుడు అప్పులు ఎలా కట్టాలో అర్థం కావడం లేదు. అప్పులోళ్లకు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం నుంచి ఇంకా మా కుటుంబానికి ఆర్థిక సాయం అందలేదు. నేను, నా పిల్లలు దిక్కులేని వాళ్లమయ్యాం. చావలేక.. చిన్న పిల్లల కోసం బతుకుతున్నాను. ఆయన్ను తలచుకోని రోజు లేదు. మా మామ ఆదెప్ప కూడా అప్పుల బాధతో 2015లో మా తోటలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మా మామ, ఆయన బతికున్నప్పుడు అందరం కలిసి ఉండేవాళ్లం. మా మామ చనిపోయిన తర్వాత మా అత్త గంగమ్మ మాతోనే ఉంటోంది. దేవుడు మా కుటుంబాన్ని ఇంత తక్కువ చూపు చూస్తాడని కలలోకూడా ఊహించలేదు.

- మంజుల, సంగప్ప భార్య

జీబీసీకి గండి

- సాగు నీటి సరఫరాను నిలిపేసిన అధికారులు
- త్వరగా మరమ్మతు చేయాలంటున్న రైతులు



ప్రధాన కాలువకు పడిన గండి



అక్విడెక్ట్ వద్ద వృథాగా పోతున్న నీరు

విడపనకల్లు, సెప్టెంబరు 9: గుంతకల్లు బ్రాంచ్(జీబీసీ) ప్రధాన కాలువకు నాలుగో కిలోమీటర్ ఉండబండ పెద్ద వంక వద్ద భారీ గండి పడింది. దీంతో అధికారులు కాలువకు నీటిని ఆపివేశారు. మండలంలో మిరప రైతులకు ఆయువు పట్టుగా ఉన్న జీబీసీకి ప్రతీ ఏటా ఏదో ఒక రూపంలో సాగు నీరు బంద్ అవుతూనే ఉంది. జూలై నెల 6న జీబీసీ గట్లు, అక్విడెక్టు బలహీనతలను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో ఇప్పుడైనా అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాలువ గట్ల బలహీనతపై సాగు నీరు రాక ముందే అధికారులను అప్రమత్తం చేసే ప్రయత్నం చేసినా ఎవరూ పట్టించుకోలేదు. జూలై నెలలో సాగు నీరు రాక ముందే కాలువకు మరమ్మతులు చేసి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఏర్పడి ఉండేది కాదని నియోజకవర్గ రైతులు వాపోతున్నారు. సోమవారం ఉదయం నాలుగో కిలో మీటర్ వద్ద కాలువకు పెద్ద గండి పడటంతో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే ఉన్న అండర్ టన్నెల్‌కు కొంత మంది నాన్ ఆయకట్టు రైతులు కుడి ఎడమల ఇరువైపులా గండ్లు కొట్టి సాగు నీటిని పెద్ద వంకకు వృథాగా తరలించుకుని వెళ్తున్నారు. గండిని జీబీసీ అధికారులు మధ్యాహ్నం పరిశీలించి వెళ్లారు. సాగు నీరు వృథా కాకుండా నీటిని మాత్రం బంద్ చేశారు. కానీ పనులను మాత్రం గాలికి వదిలేశారు. యుద్ధ ప్రాతిపదికన చేపట్టాల్సి పనులను చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వెంటనే గండిని పూడ్చి తమను ఆదుకోవాలని వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు కోరుతున్నారు.

వరద బాధితులకు దగ్గుపాటి సాయం

విజయవాడకు 60 టన్నుల కూరగాయలు



కూరగాయలు పంపుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: ఇటీవల సంభవించిన వరదలకు కకావికలమైన విజయవాడ ప్రజలకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సాయమందించారు. ఆయన సోమవారం 30 టన్నుల టమోటా, 30 టన్నుల ఇతర కూరగాయలను ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు పంపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... విజయవాడలో వరద బాధితులకు అండగా నిలిచేందుకు తమ బృందం వెళ్లిందన్నారు. కూరగాయలతోపాటు నిత్యావసర సరుకులు, దుప్పట్లను అక్కడే కొనుగోలు చేసి పంపిణీ చేస్తామన్నారు. తన వంతుగా బాధితుల కోసం మంగళవారం సీఎం చంద్రబాబుకు ఆర్థిక సాయం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగారామ్, సుధాకర్ యాదవ్, రమేష్, కృష్ణకుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, బండి కాశీ విశ్వనాథ్, కురబ నారాయణస్వామి, కడియాల కొండన్న, ఓబులనాయుడు, రాజప్ప, కొండయ్య పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు







మూడు రోజులుగా భక్తుల పూజలు అందుకున్న గణేశుడు సోమవారం సాయంత్రం గంగమ్మ ఒడికి తరలాడు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడో రోజే గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం గణేష్ మండపాలవద్ద పండితుల వేదమంత్రోచ్చారణ నడుమ తుదిపూజలు నిర్వహించి విగ్రహాలను వివిధ రకాల వాహనాలపైకి చేర్చి, నిమజ్జనానికి తరలించారు. భక్తులు కేరింతలు కొడుతూ డీజే శబ్దాలకు అనుగుణంగా వాహనాల ముందు నర్తించారు. డ్రమ్స్ వాయిద్యాల నడుమ ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ బోలో గణేష్ మహారాజ్‌కి జై అంటూ నినదించారు. అనంతరం ఆయా గ్రామాల సమీపాన ఉన్న వాగులు, వంకల్లో వినాయకుడిని నిమజ్జనం చేశారు. అనంతపురం నగర ప్రజలు రాప్తాడు వద్ద గల పండమేరు వంకలో బొజ్జగణపయ్యలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో అన్నదానం చేశారు.

- అనంతపురం కల్చరల్





రాప్తాడు వద్ద గణనాథుడి నిమజ్జనం దృశ్యాలు

33 గేట్లు మార్చాల్సిందే..!

- నిపుణుల కమిటీ సూచన..?
- తుంగభద్ర డ్యాం తనిఖీ



తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న నిపుణుల కమిటీ, అధికారులు

రాయదుర్గం, సెప్టెంబరు 9: తుంగభద్ర డ్యాంను నిపుణుల కమిటీ సోమవారం తనిఖీ చేసింది. మొత్తం 33 క్రస్ట్ గేట్లను మార్చాల్సిందేనని సూచించినట్లు తెలిసింది. కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ ఏకే బజాజ్, హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ ఎక్స్‌పర్ట్స్ హర్కేష్ కుమార్, ఏపీ నుంచి బోర్డు సభ్యుడు, సీఈ నాగరాజు, తెలంగాణ నుంచి ఈఈ బాలమురళీకృష్ణ, డ్యాం సేఫ్టీ రిటైర్డ్ ఎస్ఈ సుధాకర్, కర్ణాటక రిటైర్డ్ సెక్రటరీ సిద్ధగంగప్ప బృందంగా పర్యటించారు. ఆనకట్టపై ఉన్న షట్టర్లతో పాటు రాతి కట్టడాన్ని ఉదయం నుంచి రాత్రి వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. జలాశయానికి ఉన్న 33 క్రస్ట్‌గేట్ల షట్టర్లలో.. 19వ గేట్ మినహా మిగిలిన 32 గేట్లను తనిఖీ చేశారు. ముందుగా చైన్ లింకులను పరిశీలించారు. గైడ్ యాంగిల్, కౌంటర్ వెయిట్‌లను పరిశీలించిన అనంతరం రాతికట్టడాన్ని చూశారు. 70 ఏళ్ల క్రితం డ్యాం నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన క్రస్ట్ గేట్ల మందాన్ని అధ్యయనం చేశారు. నీటి అలల ఒత్తిడికి షట్టర్లు మందంలో తేడా వచ్చిందా (అరిగాయా..?) అని ఆరాతీశారు. గతంలో అధ్యయనం చేసినవారు సీడబ్ల్యూసీకి సమర్పించిన నివేదికలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. షట్టర్ల ఆపరేషన్ సిస్టం గురించి డ్యాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏడాదిలో తొమ్మిది నెలల పాటు జలాశయంలో నీటి నిల్వలు ఉంటాయి. ఈ నేపథ్యంలో గేట్ల నిర్వహణ ఎలా జరుగుతోందని బోర్డు అధికారులను అడిగి, వాటికి సంబంధించిన రికార్డులను సమీక్షించారు. ప్రధానంగా డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ (డ్రిప్) కింద కేటాయించిన నిధులు, ఖర్చు పెట్టిన వాటి వివరాలను తెలుసుకున్నారు. జలాశయం గైడ్ యాంగిల్ వద్ద, షట్టర్ల చైన్‌లింకుల వద్ద రాతి అరుగుదలను కూడా పూర్తిగా పరిశీలించారు. 70 ఏళ్లుగా నీటిని నిల్వ చేస్తుండడంతో అలలు షట్టర్లను తాకడం, కట్టడాన్ని కూడా బలంగా ఢీ కొడుతుండడం వంటి అంశాల గురించి పరిశీలించారు. అలల వేగాన్ని పరిగణలోకి తీసుకుని సమీక్షిస్తున్నారు. నీటి నిల్వ గురించి పూర్తిగా తెలుసుకుని, ఏఏ నెలలో ఎంత నిల్వ ఉంటుందో రికార్డులను పరిశీలించారు. ప్రాజెక్టు గర్భంలో ఉన్న గ్యాలరీని నిపుణుల కమిటీ పరిశీలించింది. సమగ్ర నివేదికను మంగళవారం సిద్ధం చేస్తారని బోర్డు అధికారులు వెల్లడించారు.

వచ్చేశారు..

- నగరానికి చేరిన మరో రెండు జట్లు
- ఇండియా-ఎ, బి జట్ల సభ్యులకు ఘన స్వాగతం


శివందూబేకు పూలతో స్వాగతం పలుకుతున్న సిబ్బంది

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9: దులీప్‌ట్రోఫీలో పాల్గొనేందుకు ఇండియా-ఎ, ఇండియా-బి జట్లు సోమవారం అనంతపురం చేరుకున్నాయి. ఈనెల 12నుంచి 15 తేదీ వరకు క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. నాలుగు మ్యాచ్‌లు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా ఇప్పటికే ఇండియా-సి, ఇండియా-డి జట్ల మధ్య ఒక మ్యాచ్ పూర్తయ్యింది. ఈక్రమంలో పోలీసుల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇండియా-ఎ: మయాంక్ అగర్వాల్ (కెప్టెన్), రియాన్‌పరాగ్, అక్షయ్‌వాడ్కర్, ఎస్‌కె రషీద్, తిలక్‌వర్మ, శివం దూబే, తనుష్ కొటియాన్, శాంమ్‌ములాని, ప్రసిద్ధ్‌కృష్ణ, ఖలీల్‌అహ్మద్, ఆవేష్‌ఖాన్, కుమార్‌కుషర్గ, శావత్ రావత్, అఖీబ్‌ఖాన్, ప్రతమ్‌సింగ్.

ఇండియా-బి: అభిమన్యు ఈశ్వరన్ (కెప్టెన్), రింకూసింగ్, నవదీప్‌సైనీ, వాషింగ్టన్ సుందర్, ముఖేష్‌కుమార్, ఆర్ సాయికిశోర్, ముషీర్‌ఖాన్, నితీష్‌కుమార్ రెడ్డి, సుయాష్ ప్రభుదేశాయి, రాహుల్ చాహర్, ఎన్ జగదీషన్, హిమాన్షుమంత్రి, సౌరాషిస్ లహరి, మోహిత్ అవాస్తి, జర్నల్‌సింగ్.

రెండో హోటల్‌లో ప్లేయర్లకు బస


తిలక్‌వర్మ, ప్రసిధ్‌కృష్ణ, రింకూసింగ్‌లకు స్వాగతం

ఇండియా ఎ, బి జట్ల ఆటగాళ్లు సోమవారం మధ్యాహ్నం నగరంలోని మాసినేని గ్రాండ్‌హోటల్‌కు చేరారు. ఆంధ్రా క్రికెట్ సంఘం, జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు, హోటల్ సిబ్బంది ఆటగాళ్లకు పుష్పగుచ్ఛం అందించి, తిలకం దిద్ది ఘనంగా స్వాగతం పలికారు. కాగా ఇప్పటికే ఇండియా సి, డి జట్ల ఆటగాళ్లు నగరంలోని అలెగ్జాండర్ హోటల్‌లో దిగిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా హోటల్‌కే పరిమితమైన ఇండియా సి, డి జట్ల ఆటగాళ్లతో ఇండియా ఎ, బి జట్ల ఆటగాళ్లు మంగళవారం ఏసీజీలో నెట్‌ప్రాక్టీస్‌లో పాల్గొననున్నారు.


వాషింగ్టన్ సుందర్‌కు హారతి ఇస్తున్న హోటల్ సిబ్బంది

దులీప్‌ట్రోఫీ మ్యాచ్‌లు ఇవే..

ఇప్పటికే తొలిమ్యాచ్ పూర్తికాగా ఈనెల 12 నుంచి 15వతేదీ వరకు ఇండియా- ఎ, ఇండియా- డి మధ్య, (ఏ గ్రౌండ్), ఇండియా బి-ఇండియా సి (బి గ్రౌండ్)మధ్య, 19 నుంచి 22వరకు ఇండియా ఎ-ఇండియా సి (ఏ గ్రౌండ్) మధ్య, ఇండియా బి-ఇండియా డి(బి గ్రౌండ్) జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి.


మయాంక్ అగర్వాల్‌కు స్వాగతం

చీనీ టన్ను రూ.22వేలు



అనంతపురం రూరల్, సెప్టెంబరు 9: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 67టన్నుల చీనీ కాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.24



అనంతపురం రూరల్, సెప్టెంబరు 9: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. సోమవారం 2100 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.16, కనిష్ఠ ధర రూ.10పలికినట్లు ఆయన తెలిపారు.

నిధుల స్కాం కలకలం

కమిషనరేట్ అధికారుల ఆరా

అనంతపురం విద్య, సెప్టెంబరు 9: జిల్లా సాధారణ పరీక్షల మండలిలో నిధుల స్కాం బహిర్గతం కావడంతో బాధ్యులైన అధికారుల్లో గుబులు మొదలైంది. డీసీఈబీలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎఫ్ఏ-3 ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్- షీట్స్ ముద్రణకు నకిలీ వర్క్ ఆర్డర్‌ను అధికారులు సృష్టించారు. డీఈఓ వరలక్ష్మి ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లాకు వచ్చారు. కానీ డిసెంబరులోనే ఆమె జిల్లాలో ఉన్నట్లు నకిలీ ఉత్తర్వులను డీసీఈబీ అధికారులు సృష్టించారు. ఈ వ్యవహారంపై 'నిధుల స్కాం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఉపాధ్యాయులు, విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా డీసీఈబీ అధికారులు రూ.31.8 లక్షల విలువైన వర్క్‌కు సంబంధించిన ఉత్తర్వులు సృష్టించడం బయటపడటంతో ఆయా వర్గాల్లో టెన్షన్ మొదలైంది. ఉమ్మడి జిల్లా విద్యాశాఖ స్పెషల్ ఆఫీసర్, జాయింట్ డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి సైతం ఈ కథనంపై ఆరా తీసినట్లు తెలిసింది. సెలవులో ఉన్న డీఈఓ వరలక్ష్మి సైతం సంబంధిత అధికారులను ఏం జరుగుతోందని ప్రశ్నించి, అసంతృప్తి వ్యక్తం చేసిందని తెలిసింది. విజయవాడలోని పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారులు సైతం విచారణకు సిద్ధమైనట్లు విశ్వసనీయవర్గాల సమాచారం.

దివ్యాంగ బాలికపై అత్యాచారం..నిందితుడి ఆత్మహత్య

నంబులపూలకుంట, సెప్టెంబరు 9: శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట మండలంలోని ఓ గ్రామంలో దివ్యాంగ బాలికపై నాగార్జున(32) అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. ఆ తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. కదిరి డీఎస్పీ శ్రీలత తెలిపిన మేరకు, సారగుండ్లపల్లికి చెందిన నాగార్జున తన భార్యను ఆదివారం పుట్టింట్లో వదిలేందుకు ద్విచక్రవాహనంలో వెళ్లాడు. రాత్రికి తిరిగి వచ్చే సమయంలో, ఆదే మార్గంలో ఉన్న ఓ ఊరిలో దివ్యాంగురాలైన బాలిక, మరికొందరు చిన్నారులు ఆడుకుంటూ కనిపించారు. దివ్యాంగ బాలికను నాగార్జున ముళ్ల పొదల్లోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఇది చూసిన చిన్నారులు కేకలు వేయడంతో గ్రామస్థులతోపాటు బాలిక తండ్రి అక్కడికి చేరుకున్నారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా స్వగ్రామానికి పారిపోయాడు. అక్కడ నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో ఉరి వేసుకున్నాడు. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని రాసుకున్న సూసైడ్ నోట్‌ను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. బాధిత బాలికను ఆస్పత్రికి తరలించామని, నిందితుడి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని డీఎస్పీ తెలిపారు. నాగార్జున వైసీపీ హయాంలో గ్రామ వలంటీరుగా పనిచేశాడు. రెండేళ్ల క్రితమే వివాహం జరిగింది.

12న ఐఏబీ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9: ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం 12వ తేదీన కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఐఏబీ చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్, కన్వీనర్ హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. టీబీ డ్యాంలో నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి 26.368టీఎంసీల నీటిని కేటాయించారన్నారు. ఇందులో జిల్లాకు 10 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించడం, మిగిలిన 16.365 టీఎంసీల నీటిని లక్ష ఎకరాల్లో ఆరుతడి పంటల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామన్నారు. ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. అవసరానికి అనుగుణంగా ఆన్ అండ్ ఆఫ్ విధానాన్ని అమలు చేసి, నీటి కొరత రాకుండా చూస్తామన్నారు. నీటి చౌర్యం, నీటి వృథాని అరికట్టడంపై, అనధికారిక నీటి వాడుకను అరికడతామన్నారు. ఇక హంద్రీ నీవా, మైనర్ ఇరిగేషన్‌తో పాటు హెచ్చెల్సీకి కేటాయించిన నీటి విడుదల తేదీలను ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాలతో పాటు అనంతపురం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

4 కిలోలకు పైగా మత్తు పదార్థం స్వాధీనం


అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కూడేరు మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన బద్దిపూటి శ్రీధర్(ప్రస్తుతం అనంతపురంలోని బళ్లారి బైపాస్ సమీపంలో), గుండారపు నాగరాజులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 4400 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రూ.30,500లు, బంగారు గొలుసు, రెండు ఉంగరాలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం త్రీటౌన్ సీఐ శాంతిలాల్ అరెస్ట్ వివరాలు వెల్లడించారు. బద్దిపూటి శ్రీధర్ పాతూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో టెంకాయల మండి నిర్వహిస్తున్నాడు. దాంతో వచ్చే సంపాదన తాను చేసే జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని భావించాడు. టెంకాయలను అమలాపురం, రాజమండ్రి, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి లారీలలో తెప్పిస్తుండేవాడు. ఈ క్రమంలో రాజమండ్రిలో ప్రసాద్ అనే కారు డ్రైవర్ పరిచయం అయ్యాడు. ప్రసాద్ గంజాయి వ్యాపారం చేస్తుంటాడని తెలుసుకుని అతడి ద్వారా అనకాపల్లి నుంచి టెంకాయల మధ్యలో గంజాయిని పెట్టి తెప్పించేవాడు. తన గ్రామానికే చెందిన, వరుసకు అన్న అయిన గుండారపు నాగరాజుతో కలిసి గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లలో ఉంచి ఎక్కువ ధరకు విక్రయించేవాడు. ఆదివారం కారులో గంజాయిని విక్రయించేందుకు తరలిస్తుండగా సీఐ శాంతిలాల్, ఎస్ఐ గోపాలుడు సిబ్బందితో కలిసి బళ్లారి బైపాస్‌లోని ఎంజీ పెట్రోల్ బంకు సమీపంలో శ్రీధర్, నాగరాజులను అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఏడాది ఫ్రీనే

- ఈ ఖరీఫ్‌కు ఉచిత పంటల బీమా వర్తింపు
- రబీ నుంచి రైతులు ప్రీమియం కట్టాల్సిందే
- గెజిట్ నోటిఫికేషన్ జారీ



అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పలు రకాల పంటలకు ఉచిత పంటల బీమాను వర్తింప జేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ఉచిత పంటల బీమా కొనసాగుతుంది. ఈ మేరకు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జిల్లాలో ఉచిత పంటల బీమాను అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమాను వర్తింపజేశారు. రబీలో టమోటా పంట వాతావరణ ఆధారిత ఉచిత పంటల బీమాను వర్తింపజేశారు. దిగుబడి ఆధారిత బీమా కింద ఖరీఫ్ సీజన్‌లో కంది, వరి, మొక్కజొన్న, జొన్న పంటలు చేర్చారు. రబీ సీజన్‌లో పప్పుశనగ, వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటకు వర్తింపజేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు మాత్రమే రైతులకు ఉచిత పంటల బీమాను వర్తింపజేస్తారు. ఈ పంట నమోదు ఆధారంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమాను అమలు చేస్తారు.

ఈ ఏడాది రబీ నుంచి ప్రీమియం చెల్లించాల్సిందే

ఈ ఏడాది రబీ నుంచి రైతులు పంటల వారిగా బీమా వర్తింపు కోసం నిర్దేశించిన ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ పంట నమోదుతోపాటు బ్యాంకుల్లో రుణం తీసుకునే రైతులు బ్యాంకుల్లోనే ప్రీమియం చెల్లించాలి. రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లల్లో డీడీ తీసి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆఫీస్‌కు పంపాల్సి ఉంటుంది. ఈ ఏడాది రబీ సీజన్ నుంచి వేరుశనగకు 2 శాతం ప్రీమియం, పత్తికి 3 శాతం, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.

13లోగా బదిలీలు పూర్తి చేయండి

- ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- అధికారులకు కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశం
- ఏంటో..ఇదంతా పై స్పందించిన కలెక్టరు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 9: బదిలీల ప్రక్రియను ఈనెల 13 లోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు.సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ఏంటో ఇదంతా శీర్షికన బదిలీలో నెలకొన్న అయోమయ పరిపరిస్థితులపై ఓ కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టరు స్పందించి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి బదిలీలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎవరెవరిని బదిలీ చేయాలో వారి జాబితాను తొలుత తయారు చేసి వెయిటింగ్ ఫర్ పోస్టింగ్స్ ఉంటే అలాంటి వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం ఉన్న ఖాళీల వివరాలను కార్యాలయాలలో ప్రదర్శించాలన్నారు. జిల్లా అధికారుల స్థాయిలో జరిగే బదిలీలు అన్నీ పూర్తి చేయాలని, ఎక్కడైనా సందేహాలు, సమస్యలు ఏర్పడితే డీఆర్ఓ లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలు, రైతులకు తెలిసేలా ప్రతి గురువారం ఉదయం 7-45గంటలనుంచి 8-15వరకు ఆల్‌ఇండియా రేడియోలో కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందులో ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొనాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. వెల్ఫేర్ అధికారులు తమ ఫోన్ నెంబర్లను ఆయా హాస్టళ్లలో ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, వివిశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధితుల ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వద్దు

బాధితుల ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 315మంది బాధితులు తమ సమస్యల గురించి వినతిపత్రాలు అందజేశారు. కలెక్టరుతోపాటు డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శిరీష, కరుణకుమారి, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో గ్రీవెన్స్ ఫిర్యాదులపై కలెక్టరు సమీక్షించారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు, డీఆర్ఓ తదితరులు

● ఆస్పత్రులలో మౌలిక వసతులు కల్పించాలి

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు ఆదేశించారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రిలలో మౌలిక వసతుల కల్పనకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అన్నింటికి ఎన్క్యూర్ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేయాలన్నారు. ఆస్పత్రులలో ఇంటర్నల్ రోడ్లు, సివిల్ వర్క్‌లు, తాగునీటికొలాయి కనెక్షన్స్, మరుగుదొడ్లు, విద్యుత్, బయో మెడికల్ స్టోరేజ్ పాయింట్స్, సూచిక బోర్డులు వంటివి చేపట్టాలన్నారు. సివిల్ వర్కులకు సంబంధించి ఎంఎస్ఐడీసీ వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

జిల్లాలో వివిధశాఖలలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఆఫీస్ సబార్డినేటర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా, వీఆర్ఏ నుంచి వీఆర్ఓలుగా, వీఆర్ఓలనుంచి సీనియర్‌అసిస్టెంట్లుగా, సీనియర్ అసిస్టెంట్లుకు డిప్యూటీ తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. అలాగే కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈప్రక్రియ 15రోజులలో పూర్తి చేయాలని కలెక్టరు ఆదేశించారు.

గొల్లపల్లికి నో సిగ్నల్

- మొబైల్ నెట్‌వర్క్ లేక గ్రామస్థుల ఇబ్బందులు
- ఇంట్లో ఉంటే మోగని ఫోన్లు
- ఫోన్‌లో మాట్లాడాలంటే ఊరి బయటకెళ్లాల్సిందే

రాప్తాడు, సెప్టెంబరు 9: ఆ ఊరిలోని ఏ ఇంట్లోకి ఏ మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్స్ రావు. ఎవరికైనా ఫోన్ చేయాలంటే మిద్దె ఎక్కాలి లేదా ఊరు బయటకెళ్లాలి. ఇది రాప్తాడు మండలంలోని గొల్లపల్లి పరిస్థితి. గొల్లపల్లి 44వ జాతీయరహదారి పక్కనే, మరూరు టోల్ గేట్‌కు కి.మీ దూరంలో ఉంది. దాదాపు 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలోని ప్రతి ఇంట్లో రెండు, మూడు స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. కానీ జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ తదితర నెట్‌వర్క్ టవర్లు ఆ గ్రామానికి చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఆ గ్రామంలో మొబైల్ నెట్వర్క్ అందకపోవడమే ప్రధాన సమస్యగా ఉంది. అప్పుడప్పుడు ఒక పాయింట్ సిగ్నల్ వస్తూ... పోతూ... ఉంటుంది. గ్రామంలో మొబైల్ నెట్‌వర్క్ లేకపోవడం వలన గ్రామస్థులందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఉన్నప్పుడు సిగ్నల్స్ రాకపోవడం వలన ఎవరి ఫోన్లు రావు. ఎవరికైనా ఫోన్ చేయాలంటే మిద్దె ఎక్కాలి... లేదా ఊరు బయటకు వెళ్లి ఫోన్ చేసి మాట్లాడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఊరికి వచ్చినప్పుడు వర్క్ ఫ్రం హోం చేయాలంటే సిగ్నల్స్ లేక ఆన్‌లైన్ వర్క్ సకాలంలో చేయలేకపోతున్నారు. ల్యాప్ టాప్‌లో పని చేయాలంటే మిద్దెలపైకి ఎక్కి నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే గ్రామంలో సిగ్నల్స్ లేకపోవడం వలన యువకులు ఎక్కువ సమయం మరూరు టోల్ గేటు వద్ద, జాతీయ రహదారి పక్కన గల టీ కేఫ్‌లలో గడుపుతుంటారు. ఏదైనా పని నిమిత్తం గొల్లపల్లికి వచ్చినవారి పరిస్థితి అగమ్యగోచరం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి సిగ్నల్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



సిగ్నల్స్ లేక ఇబ్బంది పడుతున్నాం



నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. మా గ్రామంలో ఏ సిగ్నల్స్ రావు. దీంతో వర్క్ ఫ్రం హోం చేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నా. రూ. 40 వేలు ఖర్చు చేసి ఫైబర్ నెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నా ప్రయోజనం లేదు.

- కళ్యాణ్ గ్రామస్థుడు

ఫోన్ మాట్లాడాలంటే బయటకెళ్లాలి



మా ఊర్లో ఏ సిగ్నల్స్ రావు. ఇంట్లో ఉన్నప్పుడు ఫోన్లు రింగ్‌కావు. దీంతో బంధువులు, మిత్రుల సమాచారం సకాలంలో తెలుసుకోలేపోతున్నాం. ఫోన్‌లో మాట్లాడాలంటే బయటకెళ్లాలి. మిద్దె ఎక్కితే అరకొరగా సిగ్నల్స్ వస్తాయి. వాయిస్ క్లారిటీగా ఉండదు. ఊరిబయటకెళ్లి ఫోన్‌లో మాట్లాడాలి.

- మల్లికార్జున గ్రామస్థుడు.

జీడిపల్లి రిజర్వాయర్‌కి 1026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 9 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1026 క్యూసెక్కులు ఉన్నటు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో ఫేజ్-2కు 932 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 54 క్యూసెక్కుల నీరు వెళుతోందని వెల్లడించారు. రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

తాగునీటి కార్మికుల సమస్యలు పట్టవా ?

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 9: తాగునీటి కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా..? అని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ప్రశ్నించారు. తాగునీటి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి క్లాక్‌టవర్ నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ఎదుటే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆదేశంతో కార్మికులను ఒక్కొక్కరిగా లోనికి అనుమతించడంతో వారు కలెక్టర్‌ను కలిసి వ్యక్తిగత అర్జీలను అందజేసి, సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ వేతన బకాయిలు, పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలను చెల్లించాలని సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఐదో రోజు కొనసాగిందన్నారు. కార్మికుల సమస్యలపై గత ప్రభుత్వం తీవ్ర అలసత్వం వహించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తుందని నమ్ముతున్నట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ప్రతి మూడునెలలకోసారి కార్మికులు రోడ్డెక్కితే తప్ప వేతనాలందని దుస్థితి ఉండేదన్నారు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుండటం ఆందోళనకరంగా ఉందన్నారు. తక్షణమే 8 నెలల బకాయి వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని కోరారు. రాష్ట్రస్థాయి అధికారులతో చర్చించి, త్వరలోనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం అక్కడే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, జడ్పీ సీఈఓలను పిలిచి, పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సత్యసాయి వాటర్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి శ్రీరాములు, తిప్పేస్వామి, త్రిలోక్, బాలకృష్ణ, బాబయ్య, వెంకటేష్, మధు, సోము, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎర్రిస్వామి, రామాంజనేయులు, రాముడు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.


పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

వైభవంగా నిమజ్జనోత్సవం

వినాయక చవితి వేడుకల్లో భాగంగా మూడవరోజున వాడవాడలా ఆధ్యాత్మికశోభ ఉట్టిపడింది. నగరంలోని వీధుల్లో గల పలు గణనాథుని మండపాలతోపాటు గ్రామాల్లోనూ పలు ప్రాంతాల్లో మూడోరోజు గజాననుడి నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. సాయంత్రం గణేశ్ మండపాలవద్ద పండితుల వేదమంత్రోచ్చరణ నడుమ తుదిపూజలు నిర్వహించి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మహిళలు, అమ్మాయి చిన్న పెద్ద అన్న తేడా లేకుండా ప్రతిఒక్కరూ వేడుకల్లో పాల్గొన్నారు. -న్యూస్ నెట్‌వర్క్



అనంతపురంరూరల్: కృష్ణంరెడ్డిపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు, యువత, మహిళల కోలాహలం



కనగానపల్లిలో...



చెన్నేకొత్తపల్లిలో...



రాప్తాడులో...



శింగనమలలో...



అనంతపురంలోని మూడో రోడ్డులో...


నగరంలో కొలువుదీరిన గణనాథులు



నవోదయ కాలనీలో శివపుత్రుడిగా..



పాతూరులో గంగను భూమికి తీసుకొస్తున్న చందంగా...



డ్రైవర్స్ కాలనీలో నృసింహుడిపై కొలువుదీరిన గణనాథుడు



విద్యుత్‌నగర్ సర్కిల్‌లో కాళికాదేవి సమేత వినాయకుడు

సలార్ వినాయకుడికి అరుదైన గుర్తింపు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 9: నగరంలో ఏర్పాటు చేసిన సలార్ వినాయక విగ్రహానికి అరుదైన గుర్తింపు లభించింది. వినాయకచవితి సందర్భంగా కళ్యాణదుర్గం రోడ్డు రాజాహోటల్ ఎదురుగా విద్యారణ్యనగర్‌లో వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రభాస్ నటించిన సలార్ వినాయకున్ని ప్రతిష్ఠించారు. ఈ వినాయకున్ని ఆ చిత్రం హీరోయిన్ శ్రీయారెడ్డిలో ఇన్‌స్టాలో షేర్ చేసింది. 25 లక్షలు వ్యూస్ వచ్చాయి. 2.5లక్షలు లైక్‌లు వచ్చాయి. దీంతో ఉత్సవసమితి సభ్యులు ఉ ప్పర కుళ్లాయప్ప, విష్ణు, శేఖర్, అమర్, శివకృష్ణ, భార్గవ్ సాయి, ఆరిఫ్, అక్షయ్ హర్షం వ్యక్తం చేశారు.



సలార్ వినాయకున్ని ఇన్‌స్టాలో పోస్టు చేసిన హీరోయిన్ శ్రీయారెడ్డి

జేఎన్‌టీయూ ఉద్యోగుల దాతృత్వం

అనంతపురం సెంట్రల్, సెప్టంబరు 9: జేఎన్‌టీయూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దాతృత్వాన్ని చాటారు. తోటి ఉద్యోగి నాగలక్ష్మి మరణించడంతో ఆమె కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. సోమవారం వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో నాగలక్ష్మి భర్త శివరామిరెడ్డికి రూ.36,666 చెక్కును అందజేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శిరీష్‌రెడ్డి, వెంకటరాముడు మాట్లాడుతూ శివరామిరెడ్డి, నాగలక్ష్మి దంపతులిద్దరూ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని తెలిపారు. అయితే నాగలక్ష్మి మరణించడంతో ఆ కుటుంబానికి తమవంతుగా సాయంచేసేందుకు తోటి ఉద్యోగులు ముందుకొచ్చారన్నారు. నాయకులు రహంతుల్లా, క్రిష్ణయ్య, సాయినాథ్, దివాకర్ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు..?

- అసంపూర్తిగా రుద్రంపేట రోడ్డు నిర్మాణ పనులు
- దుమ్ముధూళితో స్థానికుల సహజీవనం
- నిత్యం అవస్థల ప్రయాణం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 9: ఆ రోడ్డు నిత్యం రద్దీతో ఉంటుంది. గ్రామాల నుంచి వివిధ పనులు నిమిత్తం వచ్చేవారు కొందరైతే... జిల్లా కేంద్రం నుంచి కళాశాలలు, గ్రామాలకు వెళ్లే వారు మరికొందరు. వందల వాహనాలు ఆ రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి రోడ్డు నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. రోడ్డు నిర్మాణం చేపట్టి మూడేళ్లు అవుతోంది. గత ప్రభుత్వ పెద్దలు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నికల సమీస్తున్న తరుణంలో ఉన్న రోడ్డును ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఆ తరువాత కొంత రోడ్డు నిర్మించారు. అనంతరం లావుసైజు కంకర పరిచి వదిలేశారు. ఇది జరిగి ఏడాది కావస్తోంది. ఇదీ



రోడ్డుపై ఏర్పాడిన గుంతలు



రుద్రంపేట సర్కిల్ సమీపంలో రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయని దృశ్యం

రుద్రంపేట ప్రధాన రోడ్డు దుస్థితి. రోడ్డు నిర్మాణంలో నెలకొన్న జాప్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్క ఉంటున్న వారు దుమ్ముధూళితో సహజీవనం చేస్తున్నారు.

అసంపూర్తిగా రోడ్డు నిర్మాణ పనులు

రుద్రంపేట ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు ఎక్కడిఎక్కడ నిలిచిపోయాయి. రోడ్డు పొడవునా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. సర్కిల్‌లో నుంచి వంద మీటర్లు రోడ్డు వేశారు. ఈ రోడ్డుకు మధ్యలో డివైడర్ నిర్మించకుండా వదిలేశారు. ఇక మిగిలిన రోడ్డు అంతా అధ్వానంగా ఉంది. దీనికితోడు మరికొంత భాగం నిర్మాణం కోసం పెద్ద కంకర పరిచారు. అలాగే రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలున్నాయి. వాటిని మార్పు చేయాల్సి ఉంది.

దుమ్ము ధూళితో సహ జీవనం..

రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి గ్రామస్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి కళాశాలలకు విద్యార్థులు నిత్యం వెళ్లివస్తున్నారు. రోడ్డు నిర్మాణం కారణంగా పాత రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో పెద్ద గుంతలు పడ్డాయి. వర్షం వచ్చిందంటే ఎక్కడ ఏ గుంత ఉందో, ఎందులో పడతామేమోనని వాహనదారులు భయపడిపోతున్నారు. మిగతా సమయంలో రోడ్డుపై లేస్తున్న దుమ్ముధూళి మధ్య రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల దుకాణదారులు, స్థానికంగా నివాసముంటున్నా వారి ఇబ్బందులు చెప్పక్కర్లేదు. ఈ రోడ్డు ఏ ముహూర్తంలో మొదలు పెట్టారో కాని.. నిత్యం ఇబ్బందులు పడుతున్నామంటూ సానికులు మండి పడుతున్నారు.

నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు నిర్మాణంతో మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. నిత్యం వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము, ధూళి పెద్ద ఎత్తున లేస్తోంది. అది కాస్త ఇళ్లలోకి, దుకాణాల్లోకి వచ్చి చేరుతోంది. ఆ దుమ్ము, ధూళిని తొలగించుకునేందుకే నానా అవస్థలు పడుతున్నాం. సమస్య ఎప్పటికి తీరుతుందో?

- నాగేంద్ర, హోటల్ నిర్వాహకుడు, చంద్రబాబు కొట్టాల

ఉండలేని పరిస్థితి



ఎనిమిదేళ్లుగా స్థానికంగా హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై లేచే దుమ్ము,ధూళి కారణంగా స్థానికంగా ఉండలేని పరిస్థితి. రోడ్డు నిర్మాణం ప్రారంభం నుంచి ఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- కుళ్లాయప్ప, మదీనా హోటల్, రుద్రంపేట

టీచర్లు క్రీడల్లో పాల్గొనాలి: మాజీ ఎమ్మెల్సీ

అనంతపురం విద్య, సెప్టెంబరు 9: ఉపాధ్యాయులు తరచూ క్రీడల్లో పాల్గొనాలని, దీంతో ఒత్తిడి లేని బోధన అందించేందుకు అవకాశం ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ గేయానంద అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ ఆటల సంబరాలు నిర్వహించారు. అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజ్‌లో పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల కోసమే కాకుండా సామాజిక స్పృహతో సమాజ హితం కోసం కూడా పాటుపడుతుందన్నారు. టీచర్లు క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు సైతం స్ఫూర్తిగా నిలుస్తారని సూచించారు. ఇండోర్ స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన టీచర్లకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఈనెల 14న స్పోర్ట్స్ ఈవెంట్స్ ఆర్ట్స్ కాలేజ్‌లో నిర్వహించనున్నట్లు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ గేయానంద్

తెలిపారు. 22న త్రోబాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్ పోటీలు ఉంటాయన్నారు. ఇండోర్ స్టేడియం ప్రధానకార్యదర్శి సుబ్బారావు, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, రామప్ప, ఈశ్వరయ్య, రవికుమార్, సంజీవ్‌కుమార్, సుబ్బరాయుడు, కొండప్ప, గంగాధర్, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, నాగేంద్ర, రాజేంద్ర పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నియామకం



అధ్యక్ష,కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 9: బీసీ సంక్షేమ సంఘం శింగనమల నియోజకవర్గం, మండలాల అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేశారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర, రాయలసీమ యువజన అధ్యక్షుడు జశ్వంత్ వ్యాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా బోయ నరేష్, బుక్కరాయసముద్రం మండల అధ్యక్షుడిగా మోహన్, కార్యదర్శిగా మునీంద్రలను ఎంపిక చేశారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ బీసీ సమస్యలపై పోరాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా యువజన అధ్యక్షులు చిట్రా నాగరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్ ఆచారీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్ హుస్సేన్, యువజన ఉపాధ్యక్షులు గోసల బాలకృష్ణ, నాయకులు శివ, రుద్రయ్య, కౌడికి మధు, ప్రవీణ్ రాజ్, అక్కులప్ప, సాయి పాల్గొన్నారు.

అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఆంజనేయులు ఎంపిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 9: బెంగళూరులోని జక్కూరులో సోమలరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14న నిర్వహించే ఆ సంస్థ 12వ వార్షికోత్సవ వేడుకల్లో అందించే అంబేడ్కర్ జాతీయ అవార్డుకు తాను ఎంపికనైనట్లు మనవల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా పామిడి మండలానికి చెందిన తనకు ఈ అవార్డు అందజేయనున్నారని తెలిపారు.

చిన్నారి వైద్యం కోసం ఆర్థికసాయం

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 9: నాలుగేళ్ల చిన్నారి వైద్యం కోసం ఆర్థికసాయం అందించి అమ్మ సంస్థ అండగా నిలిచింది. ఆదర్శ కాలనీలో నివాసముంటున్న లక్ష్మీదేవికి పుట్టుకతోనే బుద్ధిమాంద్యం కలిగిన 13 సంవత్సరాల కుమారుడు, 9, 4 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమార్తెలున్నారు. లక్ష్మీదేవి భర్త దురలవాట్లకు బానిసై వీరిని వదిలేసి వెళ్లిపోయాడు. కూలీ పనులు చేసుకుని పిల్లలను పోషించుకునేది. ఇటీవల ఈమె చిన్నకుమార్తె సాయి వరుసగా వాంతులు చేసుకుంటుంటే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా చిన్నారికి పేగుల్లో పుండ్లు ఉండడంతోపాటు లివర్ ఇన్ఫెక్షన్ అయిందని, మెరుగైన వైద్యంకోసం బెంగళూరులోని గ్లోబల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యం కోసం రూ.3.5లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దాతల సహకారం కోసం అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డిని ఆమె ఆశ్రయించింది. సోమవారం ఆయన సదరు కుటుంబాన్ని కలిసి వైద్యం కోసం రూ.3.5లక్షల చెక్కు, ఖర్చులకోసం మరో రూ.50వేలు నగదును అందజేశారు.

తాగునీటి కోసం గ్రామస్థుల ఆందోళన

నార్పల, సెప్టెంబరు 9: తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని పులసలనూత గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నార్పల పంచాయతీ కార్యాలయాన్ని గ్రామస్థులు ముట్టడించారు. గ్రామస్థులు మాట్లాడుతూ గతకొద్దికాలంగా తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొని కనీసం తాగడానికి కూడా నీరు లేని పరిస్థితి నెలకొందన్నారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు అధికారులకు విన్నవించారు.

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 9: విజయవాడలో ఇటీవల కురిసిన వరదలకు నష్టపోయిన ప్రజలకు సప్తగిరి క్యాంఫర్ సంస్థ తనవంతు చేయూత నందించింది. సోమవారం కలెక్టరేట్‌లో



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న ఎండీ హనీఫ్

ఆ సంస్థ వైస్‌ఎండీ హనీఫ్ కలెక్టరు వినోద్ కుమార్‌ను కలిశారు. వరద బాధితుల కోసం సంస్థ తరపున రూ.5లక్షల చెక్‌ను కలెక్టరుకు అందించారు. అనంతరం హనీఫ్‌ను కలెక్టరు అభినందించారు.

13న సామాజిక తనిఖీ ప్రజావేదిక

అనంతపురం రూరల్, సెప్టెంబరు 9: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమీక్ష 13 తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024మార్చి 31 వరకు జరిగిన పనులపై ప్రజావేదిక కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9: నగరంలోని గాంధీబజార్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. బుక్కరాయసముద్రానికి చెందిన గోగుల నారాయణ (75) అనే వృద్ధుడు వ్యక్తిగత పనిమీద బత్తలపల్లి వెళ్లి తిరిగి బస్సులో వచ్చి నగరంలోని సంఘమేష్ సర్కిల్ దిగాడు. బుక్కరాయసముద్రం వెళ్లడానికి తాడిపత్రి బస్టాండ్‌కు వెళ్తుండగా బసవన్న కట్ట సమీపంలో ఎక్సెల్ వాహనం వేగంగా వెళ్తూ నారాయణను ఢీకొంది. తీవ్ర గాయాలకు గురైన నారాయణను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు నియమితుడయ్యారు. అనంతపురం ఆర్టీఏ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న శ్రీనివాసులును ఉద్యోగోన్నతిపై కదిరి ఆర్టీఓగా బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగోన్నతి పొందిన శ్రీనివాసులుకు జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వీర్రాజు, ఆర్టీఓ సురేష్‌నాయుడు, పలువురు ఎంవీఐలు, ఏఎంవీఐలు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల నిరసన

అనంతపురం టౌన్, సెప్టెంబరు 9: తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించకుండా మళ్లీ నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వడంపై సర్వజన ఆస్పత్రిలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు ఆందోళన చేపట్టారు. సోమవారం వారు తమ విధులను బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో నిరసన కొనసాగించారు. గతంలో అనేకసార్లు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తమను రెగ్యులర్ చేస్తామని హామీ ఇస్తూ వచ్చారన్నారు. అలాచేయకుండా ఇప్పుడు ప్రభుత్వం స్టాఫ్‌నర్సుల నియామకాలకు జీఓ115ను విడుదల చేయడం అన్యాయమన్నారు. ఈ జీఓవల్ల తీరని అన్యాయం జరుగుతుందని ఆ సంఘం నాయకురాలు శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబనాయుడు స్పందించి న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. స్టాఫ్‌నర్సులు ప్రవీణ, నారాయణమ్మ, శోభ, నీలిమ, ప్రసన్న పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి దొర్లకూడదు: ఎస్పీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9: అపశ్రుతులు దొర్లకుండా గణేష్ నిమజ్జనం చేపట్టాలని జిల్లా ఎస్పీ జగదీష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎస్పీ పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాన్ని సందర్శించారు. గణేష్ ప్రతిమలను కాలువ నీటిలో నిమజ్జనం చేయడాన్ని పర్యవేక్షించారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎస్పీ, ఎస్ఐలకు పలు సూచనలు చేశారు.

విగ్రహాల ఊరేగింపునకు రూట్ మ్యాప్: సప్తగిరి సర్కిల్-రాజీవ్ రోడ్డు-శ్రీకంఠం సర్కిల్- తిలక్‌రోడ్డు- తాడిపత్రి బస్టాండ్-గాంధీబజార్-బసవన్నకట్ట-సూర్యానగర్‌సర్కిల్-టవర్‌క్లాక్ -పీటీసీ- నడిమివంక - కళ్యాణదుర్గం బైపాస్(10 అడుగుల కంటే ఎత్తైన విగ్రహాలు పంపనూరు కెనాల్ వద్ద నిమజ్జనం చేయాలి). బళ్లారి బైపాస్(10 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలు రాచానపల్లి వంక వాడలో నిమజ్జనం చేయాలి)

మధ్యాహ్నం 3గంటల నుంచే..: 11వతేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచే గణేష్ విగ్రహాలు ఊరేగింపును ప్రారంభించాలని మంటపాల నిర్వాహకులకు పోలీసులు సూచించారు. 10 అడుగుల కంటే తక్కువ ఎత్తున్న విగ్రహాలను అనంతపురం రూరల్ మండలంలోని రాచానపల్లిలో నిమజ్జనం చేయాలని సూచించారు. 10 అడుగుల కంటే ఎత్తున్న విగ్రహాలను పంపనూరు కెనాల్‌లో నిమజ్జనం చేయాలన్నారు. ఎత్తైన విగ్రహాలను నిమజ్జనానికి తీసుకుని వెళ్లడానికి రుద్రంపేట బైపాస్, బళ్లారి బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్‌లలోని నేషనల్ హైవే బ్రిడ్జ్ ఆటంకం కలుగుతుందని, తపోవనం సర్కిల్ మీదుగా సర్వీస్ రోడ్డులో తీసుకెళ్లి కళ్యాణదుర్గం రోడ్డుకు వెళ్లాలి. కార్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు ఇతర భారీ వాహనాలు తపోవనం సర్కిల్, రవి పెట్రోల్ బంక్, రాజహంస అపార్ట్‌మెంట్, పంగల్‌రోడ్డు, కలెక్టరేట్, భాస్కర్ పెట్రోల్ బంక్, మేడా పెట్రోల్ బంక్, మిర్చియార్డు, తడకలేరు మీదుగా వెళ్లడం నిషేధం. నగరంలో నిమజ్జనం సందర్భంగా 500 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారు.



నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

అభివృద్ధి పనుల్లో తేడా రాకూడదు

- ఎమ్మెల్యే పరిటాల సునీత



నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: రాప్తాడు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ఎక్కడా తేడా రాకూడదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. సోమవారం అనంతపురంలోని ఆమె నివాసంలో నియోజకవర్గంలోని ముఖ్యనాయకులతో పరిటాల సునీత సమావేశమయ్యారు. గ్రామాల్లో నిర్మించబోయే సీసీ రోడ్లు, ఇతర పనులు, రేషన్ పంపిణీ, పంటల సాగు తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో రైతులు ఎలాంటి పంటలు సాగు చేస్తున్నారు? ఈ పంట నమోదుపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ రేషన్ బియ్యం అందాలన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో టీడీపీని గెలిపించారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

టెర్రరిస్టుల పాలన సాగించిన జగన్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: టెర్రరిస్టుల పాలనను తలపించేలా గత ఐదేళ్లలో జగన్ పాలన సాగించాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మండిపడ్డారు. సోమవారం స్థానిక టీడీపీ జిల్లా



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

కార్యాలయంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్నలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సరిగ్గా ఏడాది క్రితం అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడును అక్రమ అరెస్టు చేశారన్నారు. అప్పట్లో రాష్ట్ర ప్రజలతోపాటు దేశమంతా చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకించిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ఎలాంటి మచ్చలేని చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. వైసీపీ అరాచకాలను గమనించిన ప్రజలు జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికీ జగన్ కళ్లుతెరవకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు రాత్రింబవళ్లు చంద్రబాబు, మంత్రులు, అధికార యంత్రాంగం కష్టపడుతోందన్నారు. బాధితులకు చేయూతనివ్వాల్సిందిపోయి వరదను రాజకీయం చేస్తూ జగన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితులను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పరామర్శించారు. సోమవారం రాత్రి విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలోని 40వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. స్థానికంగా ఇంటింటికీ వెళ్లి వరద బాధితులతో మాట్లాడి భరోసానిచ్చారు. ఇప్పటికే ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించిందన్నారు. వరద బాధితులు తిరిగి మామూలు స్థితికి చేరుకునేలా దాకా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

భూమి ఇస్తామని మాట తప్పారు

- యజమాని బతికుండగా ఇవ్వలేకపోయారు
- చట్టాన్ని, జీవోను పక్కన పెట్టారు
- రెవెన్యూ, పురపాలకశాఖల అధికారులపై హైకోర్టు ఆగ్రహం.. రూ.50 వేల ఖర్చు చెల్లించాలని ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ విషయంలో అధికారులు చట్ట నిబంధనలు పాటించకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ప్రత్యామ్నాయంగా మరోచోట భూమిని కేటాయిస్తామని బాధిత కుటుంబానికి వాగ్దానం చేసి, అధికారులు నెరవేర్చకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది పిటిషనర్ల హక్కులు హరించడమేనని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పిటిషనర్ తన జీవిత కాలంలో ప్రత్యామ్నాయ భూమిని పొందలేకపోయారని పేర్కొంది. పిటిషనర్ నుంచి తీసుకున్న 2 సెంట్ల భూమికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం 8 వారాల్లో పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ప్రత్యామ్నాయ భూమి ఇచ్చేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా, వాటిని అమలు చేయకుండా బాధిత కుటుంబం కోర్టు ఆశ్రయించే పరిస్థితులు కల్పించినందుకు రెవెన్యూ, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శులు, పురపాలకశాఖ డైరెక్టర్, అనంతపురం మున్సిపల్ కమిషనర్‌కు రూ.50 వేలు ఖర్చులు విధించింది. ఈ సొమ్మును పిటిషనర్లకు నాలుగు వారాల్లో చెల్లించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. జయసూర్య ఇటీవల తీర్పు ఇచ్చారు. అనంతపురం పట్టంలోని సర్వేనెంబర్ 1940/4లోని 2 సెంట్ల భూమిని 1996లో రోడ్డు విస్తరణ కోసం తీసుకున్నారు. భూసేకరణ చట్టాన్ని అనుసరించి భూమిని సేకరించకుండా, ప్రత్యామ్నాయ భూమి ఇస్తామని భూయజమాని టి. నిజాముద్దీన్‌కు వాగ్దానం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యామ్నాయ భూమి ఇచ్చేందుకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. నిజాముద్దీన్‌కు భూమి ఇచ్చేందుకు వీలుగా ప్రభుత్వం 2001లో జీవో జారీ చేసింది. కానీ, దీనిని కూడా అధికారులు పట్టించుకోలేదు. అయితే.. ఈ ప్రక్రియ సాగుతుండగానే నిజాముద్దీన్ మరణించారు. దీంతో ఆయన వారసులు న్యాయపోరాటం కొనసాగించారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి అధికారుల వైఖరిని తప్పుపడుతూ తీర్పు ఇచ్చారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీధర్

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 9: రామగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ శివాంజనేయులు పుట్టపర్తి వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సీఐగా ఉన్న శ్రీధర్ ఇక్కడకు వచ్చారు. ఆయనకు పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

12న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 9: రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో 12వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి తెలిపారు. సోమవారం సీపీఎం నాయకులు నగరంలోని బియ్యం పంపిణీపై పలుప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అడిగి ఇబ్బందులను తెలుసుకున్నారు. బియ్యంతోపాటు చక్కెర, గోధుమపిండి, నూనె, కందిబేడలు పంపిణీ చేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు. 12న తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు ప్రకాష్, మసూద్, జీవ, రాజు, ఎన్టీఆర్ సీనా, వెంకటేష్, గఫూర్, వరలక్ష్మి పాల్గొన్నారు.


ఉరవకొండలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడి విగ్రహం


కుందుర్పిలో..

వినాయకా.. సెలవిక

● కోలాహలంగా గణేశుడి నిమజ్జనం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: వినాయక చవితి సందర్భంగా గత శనివారం మండపాల్లో కొలువుదీరి మూడురోజుల పాటు ప్రత్యేక పూజలందుకున్న వినాయక ప్రతిమలు సోమవారం నిమజ్జనానికి తరలాయి. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో కొలువుదీర్చిన వినాయక ప్రతిమలను నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. ఉదయం నుంచి మండపాల్లో స్వామికి ప్ర త్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మధ్యా హ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తర్వాత సాయంత్రం వివిధ వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి విగ్రహాలను అందులోకి చేర్చి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. యువత డప్పుల శబ్ధాలకు నృత్యాలు చేస్తూ.. జై బోలో గణేష్ మహరాజ్‌కీ అని నినదిస్తూ సందడి చేశారు. ఒకరి నొకరు రంగులు చల్లుకుని ఆనందించారు. తర్వాత సమీపంలోని చెరువులు, కాలువలు, కుంటల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో జరిగిన నిమజ్జనంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొని పూజలు నిర్వహించారు.


తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లిలో..


పామిడిలో..


గుత్తి మండలం గొందిపల్లిలో..


రాయదుర్గం మండలం ఉడేగోళంలో..


యాడికిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


గుత్తి పట్టణంలో..


బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ


పెద్దవడుగూరులో..


గుంతకల్లులో ఊరేగింపులో టీడీపీ నేతలు


గుంతకల్లులో కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు..


ఊరేగింపులో పాల్గొన్న కమ్మసేవా సంఘం నాయకులు

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 9: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఆరో రోజు సోమవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రి, ఆర్డీటీ ఆస్పత్రి, ప్రైవేటు క్లినిక్‌ల వద్ద ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు విరాళాలు సేకరించినట్లు జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు సోనియా, సాయి బృందాలు పాల్గొన్నారు.


కూడేరులో విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

కూడేరు: విజయవాడ వరద బాధితులకు ఆదుకోవడానికి మండలకేంద్రంలో సీపీఐ నాయకులు విరాళాలు సేకరించారు. నాయకులు మల్లికార్జున, రమణ, రమణప్ప, శ్రీరాములు, ప్రసాద్, మలరాయుడు, ముత్యాలు తదితరులు ఇంటింటికీ, దుకాణాల వద్దకు వెళ్లి రూ.10.528 నగదు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ సొమ్మును వరద బాధితులను ఆదుకోవడానికి పార్టీ జిల్లా నాయకులు అందజేయనున్నట్లు తెలిపారు.

పామిడి: వరదబాధితుల సహాయార్థం పట్టణంలోని తెలుగుతమ్ముళ్లు పలు వార్డులలో వస్త్రాలు, నగదు, నిత్యావసర సరుకులను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌ఆర్ రమేష్, కుమార్, బొమ్మా మోహన్‌కృష్ణ, శ్రీరాములు, రఫీ, హుసేన్‌పీరా, జయకుమార్, శీన, బాబా, తిమ్మప్ప, నిరంజన్, వెంకటేష్ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు విరాళం

కణేకల్లు, సెప్టెంబరు 9: మండలంలోని హనకనహాళ్ గ్రామంలో నూతనంగా చేపట్టనున్న వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు రూ. 60 వేల నగదును వితరణ చేశారు. రాయదుర్గం పట్టణంలో సోమవారం హనకనహాళ్ గ్రామానికి చెందిన వాల్మీకి సంఘం నాయకులు నాగార్జున, విజయ్, మారెప్పతో పాటు గ్రామపెద్దలు ఎమ్మెల్యేను కలిసి గ్రామంలో ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహం కోసం సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే నగదును అందజేశారు.


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

మల్లన్న సన్నిధిలో తాడిపత్రి ఎమ్మెల్యే

శ్రీశైలం, సెప్టెంబరు 9: నంద్యాల జిల్లా శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి అమ్మవారిని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి, అభిషేక పూజలు, అర్చనలు జరిపించారు. తర్వాత అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.


ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే, ఆయన కుటుంబసభ్యులు

ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయండి

తాడిపత్రి, సెప్టెంబరు 9: పట్టణంలోని పెన్నానది నుంచి విచ్చలవిడిగా ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా జరుగుతున్న ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ.. కొత్తబ్రిడ్జి నుంచి పాతబ్రిడ్జి వరకు ఇసుకను తోడేస్తుండడంతో రజక వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుకను తోడేస్తుండడంతో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయన్నారు. వర్షం వచ్చినప్పుడు ఆ గుంతల్లో నీరు చేరుతోందని, దీంతో పిల్లలు నదిలోకి వచ్చినపుడు గుంతల్లో పడే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. కొత్తబ్రిడ్జి నుంచి పాతబ్రిడ్జి వరకు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజనేయులు, అబ్రహం, సంజన్న, రామకృష్ణ, ఏఐటీయూసీ నాయకులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 9: పట్టణంలోని రైల్వే క్రీడామైదానంలో సోమవారం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ వారు ఉత్తమ ఉపాధ్యాయులు అయూబ్‌ఖాన్, ఆర్‌ఎం కాశీనాథ్‌కు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాతో సత్కరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు అంజి మాట్లాడుతూ.. గడేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్న అయూబ్ ఖాన్ విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సొంత ఖర్చులతో క్రీడాపోటీలకు విద్యార్థులను తీసుకెళ్లేవారన్నారు. అలాగే పట్టణంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్‌ఎం కాశీనాథ్ పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, కనుక వారిని సన్మానించామన్నారు. రిటైర్డ్ తహసీల్దార్ చలపతి, అసోసియేషన్ సభ్యులు పురుషోత్తం, సుబ్బరాయుడు, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాకర్స్

రాయితీ విత్తనాల పంపిణీ

ఉరవకొండ, సెప్టెంబరు 9: మండలంలోని షెక్షానుపల్లి గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో సోమవారం ఏఓ శుభకర్ రైతులకు ఉలవలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యామ్నాయ విత్తన పంపిణీలో భాగంగా ఉలవలను 80శాతం రాయితీతో ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌కే సిబ్బంది చిక్కన్న, టీడీపీ నాయకులు చలపతి, గుర్రం నరేష్, జయన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

ఉరవకొండ, సెప్టెంబరు 9: ఉరవకొండ సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలకు మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ కిషోర్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొన దలిచిన వారు ఆధార్ కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లు వెంటతీసుకురావాలన్నారు అలాగే రూ.5వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెబ్ స్టేషన్‌లో సంప్రదించవచ్చని చెప్పారు.

జనసేన ఫ్లెక్సీల చించివేతపై డీఎస్పీకి ఫిర్యాదు

గుంతకల్లు, సెప్టెంబరు 9: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టిన రోజున పట్టణంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను దుండగులు చించివేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం డీఎస్పీ శివ భాస్కర్ రెడ్డిని కలిసిన జనసేన నాయకుడు పూల రమణ మాట్లాడుతూ.. ఎస్‌ఎల్‌వీ థియేటర్ రోడ్డులోనూ, లేపాక్షి లాడ్జి వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను కొందరు దురుద్దేశపూర్వకంగా చించారని తెలిపారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు గోవిందరాజులు, బీ గోపి, విజయజ్యోతి, ఎర్రిస్వామి, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలికకు తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, సెప్టెంబరు 9: మండలంలోని చిత్రచేడు గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో రూప అనే 12 ఏళ్ల బాలిక తీవ్రంగా గాయపడింది. మిద్దెమీద ఆడుకుంటున్న రూప పొరపాటున విద్యుత్ తీగలను తగిలింది. దీంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఏఐఎస్ఎఫ్ మహాసభ కరపత్రాల విడుదల

కుందుర్పి, సెప్టెంబరు 9: ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆ ఫెడరేషన్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏబీవీపీ జిల్లా నిర్మాణ మహాసభలు ఈనెల 19, 20వ తేదీలలో కళ్యాణదుర్గం పట్టణంలో జరగనున్నట్లు చెప్పారు. విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతరాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సావన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

● భర్త, అతడి కుటుంబసభ్యులే చంపారని మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ

● రాయదుర్గం ప్రభుత్వాస్పత్రి వద్ద బంధువులతో కలిసి ఆందోళన

గుమ్మఘట్ట, సెప్టెంబరు 9: మండలంలోని పూలకుంట గ్రామంలో సోమవారం ఉదయం నందిని(22)అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పూలకుంటకు చెందిన నగేష్‌కు గోనబావికి చెందిన రామాంజనేయులు, నాగమ్మల కూమార్తె నందినితో ఆరునెలల క్రితం వివాహం జరిగింది. ఐదునెలల పాటు వీరి జీవితం సజావుగానే సాగింది. అయితే నెలరోజులుగా నగేష్‌తో పాటు అతడి కుటుంబసభ్యులు తమ కుమార్తెను వేధింపులకు గురిచేస్తున్నట్లు నందిని తండ్రి ఆరోపించాడు. సోమవారం ఉదయం నందిని బాత్రూంలో జారి పడిందని, రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి రమ్మని తెలిపారని, తీరా ఆస్పత్రికి వచ్చాక ఆమె మృతదేహాన్ని చూపించారంటూ విలపించాడు. ఈ క్రమంలో ఆమె కుటుంబసభ్యులు భారీగా ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. నందినిని భర్త , ఇతర కుటుంబసభ్యులు వేధించి చంపారంటూ ఆగ్రహించారు. దీంతో గంటపాటు ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న రాయదుర్గం సీఐ వెంకటరమణ పోలీసు సిబ్బందితో వచ్చి ఆందోళనకారులను సర్దిచెప్పారు. తర్వాత మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గుమ్మఘట్ట పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


మృతి చెందిన నందిని

వినాయకుడికి కోటి కుంకుమార్చన

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 9: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన స్వామి విగ్రహానికి సోమవారం ఆవోపా ఆధ్వర్యంలో మహిళలు కోటి కుంకుమార్చన నిర్వహించారు. ఉదయమే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో కొలువుదీర్చిన వెండి వినాయకుడికి అర్చకుల ఆధ్వర్యంలో మహిళలు కోటి కుంకుమార్చన చేశారు. ఆవోపా అధ్యక్షుడు ఇనుగూరు శంకర్‌నారాయణ, కార్యదర్శి పువ్వాడిశ్రీనివాసులు, కోశాధికారి ఎస్‌ఎంకే లక్ష్మీనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

వేరుశనగ పొలంలో పంటకోత ప్రయోగాలు

గుత్తి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని బేతాపల్లిలో రైతులు సాగు చేసిన వేరుశనగ పొలాల్లో సోమవారం గుత్తి ఏడీఏ వెంకటరాముడు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. సర్వే నంబరు 56లో గల వేరుశనగ పొలంలో చేపట్టి దిగుబడిని పరిశీలించారు. అదేవిధంగా కంది పంటను పరిశీలించి.. చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలిపారు. ఏఈఓ కృష్ణభగవన్, ఎంపీఓలు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

గుంతకల్లుటౌన్: పట్టణంలోని తహసీల్దార్‌కార్యాయలంలో తహసీల్దారు రమాదేవి, మండల వ్యవసాయ అధికారి స్వాతి పంట కోత ప్రయోగాలపై రైతుసేవాకేంద్రం సిబ్బంది, వీఆర్వోలకు శిక్షణా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట కోత ప్రయోగాలను ఆర్ఎస్‌కే సిబ్బంది త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పంట కోత ప్రయోగాలను పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ రమాదేవి, డీవైఎస్‌ఓ సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ సాయంతో కాలువ పూడికతీత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 9: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామ శివారులో భూములకు సాగు నీరందించే కాలువ పూడిపోవడంతో జిందాల్ సావ్ ఫ్యాక్టరీ సహాయంతో సోమవారం పూడికతీత పనులు నిర్వహించారు. కాలువ పూర్తిగా పూడిపోవడంతో భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతుల విన్నపం మేరకు జిందాల్ సావ్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఎక్సకవేటర్‌తో సుమారు మూడు కిలోమీటర్ల మేర కాలువ పూడికతీత పనులు చేపట్టారు. సర్పంచ్ గాదిలింగ పనులను ముందుండి చేయించారు.

సరిత మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 9: గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డి గ్రామానికి చెందిన డిగ్రీవిద్యార్థిని సరిత మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ తాలూకా కార్యదర్శి పార్వతి డిమాండ్ చేశారు. పట్టణంలోని ముత్రాసికాలనీలో సోమవారం మహిళా సమైఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సరిత అనం తపురంలోని కాలేజీకి వెళ్లడానికి స్వగ్రామం నుంచి బస్సులో బయలుదేరిందని, మరుసటి రోజు ఆత్మకూరు మండల వడ్డుపల్లి టోల్‌ప్లాజా పరిసర ప్రాంతాల్లో విగతజీవిగా పడి ఉండడం జిల్లా వ్యా ప్తంగా కలకలం రేపిందని అన్నారు. మహిళలకు, విద్యార్థినుల రక్షణ కోసం అనేక చట్టాలున్నప్పటికీ భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, మహిళా కమిషన్ పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సరిత హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సమైఖ్య సహాయ కార్యదర్శి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌లో అక్రమాలను వెలికితీయాలి..

కూడేరు, సెప్టెంబరు 9: మండలంలోని పలు గ్రామాల్లో గత వైసీపీ పాలనలో చేపట్టిన గృహ నిర్మాణాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ వైసీపీ నాయకుల కనుసన్నల్లో హౌసింగ్‌లో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. గతం నుంచి హౌసింగ్ ఏఈ పై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నా.. అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా విచారణ చేయాలని ఆయన కోరారు.

పొట్టేళ్ల అపహరణ

యాడికి, సెప్టెంబరు 9: మండలంలోని రాయలచెరువులో మూడు పొట్టేళ్లు అపహరణకు గురయ్యాయి. గ్రామానికే చెందిన ఉప్పర ప్రసాద్ రెండు పొట్టేళ్లు, రాముడు ఒక పొట్టేలును పెంచుకుంటున్నారు. కాగా ఆదివారం రాత్రి వారు ఇళ్ల వద్ద ఆరుబయట వాటిని కట్టేశారు. గమనించిన గుర్తుతెలియని దుండగులు రాత్రికి రాత్రే ఆ మూడు పొట్టేళ్లను అపహరించినట్లు బాధితులు తెలిపారు. వీటివిలువ సుమారు రూ.70వేలు ఉంటుందని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

యాడికి, సెప్టెంబరు 9: మండలంలోని రాయలచెరువులో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయలచెరువు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు అశోక్ (22) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా అతను సోమవారం సాయం త్రం గ్రామశివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుత్తికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. అశోక్‌కు ఇంకా వివాహం కాలేదు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మృతుడి ఆచూకీ లభ్యం

గుత్తి, సెప్టెంబరు 9: గుత్తి జీఆర్పీ పరిధిలోని జక్కలచెరువు-రాయలచెరువు రైల్వే స్టేషన్ల మధ్యలో గత ఆదివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప సోమవారం తెలిపారు. మృతుడు కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన తిమ్మన్న (59)గా గుర్తించామన్నారు. అప్పులబాధ తాళలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన భార్య జమునమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. మృతుడికి 5ఎకరాల భూమి ఉందని, ముగ్గురు కుమార్తెల వివాహాలకు, వ్యవసాయానికి పెట్టుబడులకు అప్పులు చేశాడని అన్నారు. వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య తెలిపిందన్నా రు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ పేర్కొన్నారు.

రూరల్ సీఐగా వంశీకృష్ణ బాధ్యతలు

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 9: కళ్యాణదుర్గం రూరల్ సీఐగా వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ చంద్రశేఖర్ అనంతపురం వీఆర్‌కు వెళ్లారు. అనంతపురం వీఆర్ నుంచి బదిలీపై కళ్యాణదుర్గం రూరల్ సీఐగా వంశీకృష్ణ వచ్చారు.

ఐఏబీ సమావేశాన్ని వెంటనే నిర్వహించాలి

● ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ, సెప్టెంబరు 9: ఇరిగేషన్ అడ్వైజర్ బోర్డు (ఐఏబీ) మీటింగ్‌ను వెంటనే నిర్వహించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సోమవారం ప్రకటనలో కోరారు. ఆగస్టు నెలలోనే నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకూ నిర్వహించలేదన్నారు. సెప్టెంబరు వచ్చినా ప్రభుత్వం ఐఏబీ మీటింగ్ నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. హెచ్చెల్సీకి నీరు ఎప్పటి వరకు వదులుతారో తెలియక రైతులు పంటలు సాగు చేసుకోలేక పోతున్నారన్నారు. ఐఏబీ మీటింగ్ నిర్వహించి, నీటి కేటాయింపును ఎంత కాలం వరకు చేయగలుగుతారో తెలిపితే.. రైతులు అందుకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవడానికి వీలు ఉంటుందన్నారు. గత వారమే తాను కలెక్టర్‌ను కలిసి ఐఏబీ మీటింగ్ నిర్వహించాలని వినతి పత్రం అందశారరి ఆయన పేర్కొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

కణేకల్లు, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని 1, 2వ అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశమై పోషక విలువల గల ఆహారం గురించి, వాటిని తీసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.


పౌష్టికాహారమాసోత్సవాల్లో అంగన్‌వాడీలు తదితరులు

జేవీవీ మహా సభలను విజయవంతం చేయండి

● రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పిలుపు

గుత్తి, సెప్టెంబరు 9: అనంతపురంలో ఈనెల 14, 15వ తేదీన నిర్వహించే జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర వార్షిక మహా సభలను విజయవంతం చేయాలని ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, మూఢ విశ్వాశాలను పారద్రోలడంలో జేవీవీ ఎనలేని కృషి చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ రంగాల్లో శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికే వైజ్ఞానిక కళాయాత్రలు, సారా వ్యతిరేక ఉద్యమం, చెకుముకి సంబరాలు, మహిళా ఐక్యవేదిక, ఉపాధ్యాయ శిక్షణ వంటి కార్యక్రమాలను ఉమ్మడి జిల్లాలో చేపట్టిందన్నారు. జేవీవీ 17వ రాష్ట్ర వార్షిక మహాసభలకు రాష్ట్ర అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు గురుశంకర్, సీతానందా, నాగరాజు, బాబు, కాశీరావు, రామదాసు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్

రాయదుర్గంరూరల్: అనంతపురంలో ఈ నెల 14, 15 తేదీలలో జరిగే జనవిజ్ఞాన వేదిక 17వ వార్షిక మహాసభలను విజయవంతం చేయాలని వేదిక రాష్ట్ర మాజీ కార్యదర్శి మురళీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచె లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని సమైక్యాంధ్రభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. తర్వాత కరపత్రాలను విడుదల చేశారు. రాయదుర్గం అధ్యక్షుడు ఈరన్న, కార్యదర్శి జగదీష్, యువత కన్వీనర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.